సాక్షి
విజయనగరం
గురువారం, 6, జూలై, 2023

న్యూస్‌రీల్

రక్తదానం



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

విజయనగరం గంటస్తంభం: ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ సంస్థ 45వ వార్షికోత్సవం సందర్భంగా సంస్థ కార్యాలయంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ వి.శ్రీనివాసరావు ప్రారంభించిన శిబిరంలో 29 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహనిర్మాణ సంస్థ లక్షలాదిమంది పేదల సొంత ఇంటికలను నెరవేర్చడంలో కీలకభూమిక పోషిస్తోందన్నారు. క్రికెట్, రంగోళి, లెమన్ అండ్ స్పూన్ తదితర పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ జేఏసీ చైర్మన్ జి.మురళీమోహన్, డీఈలు డి.శ్రీనివాస్, రంగారావు, కె.ఎం.శ్రీనివాస్, రత్నాకర్, పి.అప్పయ్య, ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, జిల్లా సర్వజన ఆస్పత్రి రక్తనిధి కేంద్రం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కౌన్సెలింగ్

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లా పరిషత్ యాజమాన్యంలో ఖాళీగా ఉన్న ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ పోస్టును పదోన్నతిపై భర్తీ చేసేందుకు గురువారం ఉదయం 9.30 గంటలకు డీఈఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. సీనియారిటీ జాబితాలోని ఎస్జీటీలు వారి సర్వీస్ రిజిస్టర్, సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని కోరారు.

ప్రీఆడిట్‌పై అవగాహన

బొబ్బిలి: మున్సిపల్ శాఖలో అమలుచేయనున్న ప్రీ ఆడిట్ విధానంపై జిల్లా ఐటీ అధికారిణి డి.అరుణకుమారి బొబ్బిలి మున్సిపల్ సిబ్బందికి బుధవారం అవగాహన కల్పించారు. ఇప్పటికే పలు శాఖల్లో ప్రీ ఆడిట్ విధానం అమలులో ఉందన్నారు. గతంలో పోస్టు ఆడిట్ అమలులో ఉండేదని తెలిపారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

- ఇక్రిశాట్ డైరెక్టర్ అశోక్‌కుమార్
- గిరిజన విశ్వవిద్యాలయంలో 'చిరుధాన్యాలపై అవగాహన' సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ఇక్రిశాట్ డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్

విజయనగరం అర్బన్: రోజూ తీసుకొనే ఆహారంలో చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలని ఇక్రిశాట్ (ఇంటర్నేషనల్ క్రాప్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ ది సెమి-అరిడ్ ట్రోపిక్స్) హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.అశోక్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరం-2023ను పురస్కరించుకొని 'మిల్లెట్స్ అండ్ న్యూట్రిషన్ సెక్యూరిటీ' అంశంపై విజయనగరం కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలో బుధవారం జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలతో రోగనిరోధక శక్తి సమకూరుతుందన్నారు. చిరుధాన్యాలపై ఇక్రిశాట్‌లో జరుగుతున్న పరిశోధనలను వివరించారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి మాట్లాడుతూ రసాయనాలు, పురుగుమందులు, ఎరువులు వాడకుండా మిల్లెట్లను సులభంగా పండించవచ్చన్నారు. మిల్లెట్లతో రొట్టెలు, ఉప్మా, గంజిగా చేసుకొని ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. డీన్ ఆఫ్ స్కూల్ ఆఫ్ సైన్సెస్ అధ్యక్షత వహించిన సదస్సుకు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిరుధ్‌కుమార్ కో ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. సదస్సులో ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఉచిత సేవలు



మహిళకు ధ్రువపత్రం అందజేస్తున్న కలెక్టర్, ఎంపీపీ

పూసపాటిరేగ: జగనన్న సురక్షతో ప్రభుత్వ సేవలు ఉచితంగా అందజేస్తున్నట్టు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. కందివలస సచివాలయం పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో ఆమె పాల్గొన్నారు. 423 మందికి వివిధ రకాలు సర్టిఫికెట్లను ఎంపీపీ మహంతి కల్యాణితో కలిసి అందజేశారు. రైతుల విజ్ఞప్తి మేరకు తోటపల్లి కాలువ ద్వారా సాగునీరు త్వరగా అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జగనన్న సురక్షతో ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తోందని ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్.సత్యనారాయణరాజు, ఎంపీడీఓ జి.రామారావు తహసీల్దార్ ఇ.భాస్కరరావు, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరావు, జనార్దనరావు, సర్పంచ్ గణేష్, ఎంపీటీసీ సత్తిబాబు పాల్గొన్నారు.

భీమసింగిని వీడని చంద్రగ్రహణం..!

- ప్రైవేట్‌పరం చేసేందుకు సహకార చక్కెర కర్మాగారాలపై వేటు
- నాడు చంద్రబాబు ప్రభుత్వం అనుసరించిన విధానాలే శాపం
- చెరకు రైతుల కష్టాలను ఏనాడూ పట్టించుకోని టీడీపీ ప్రభుత్వం
- 2003 సంవత్సరంలో నష్టాల ముసుగులో తొలిసారిగా మూత
- మళ్లీ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పునఃప్రారంభం
- తర్వాత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో మళ్లీ కష్టాలు
- రూ.12 కోట్లు ఆర్థిక సాయం చేశామంటూ ప్రచారమే తప్ప ఆచరణ శూన్యం
- 2014-15 సంవత్సరంలో 92,737 మెట్రిక్ టన్నులు చెరకు సరఫరా
- చంద్రబాబు పాలన ముగిసే సమయానికి (2019-20) 56,100 మెట్రిక్ టన్నులకు తగ్గిపోయిన వైనం
- తగిన స్థాయిలో చెరకు లేక ఫ్యాక్టరీ 2020-21లో క్రషింగ్ నిలిపివేత
- శాశ్వతంగా మూసివేస్తారంటూ ఇప్పుడు టీడీపీ నేతల విషప్రచారం



భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

భీమసింగి వద్దనున్న విజయరామ సహకార చక్కెర కర్మాగారాన్ని 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో ఏవిధంగా నిర్వీర్యం చేసిందీ గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య మాటలు కళ్లకు కడుతున్నాయి. 1995 నుంచి 2003 వరకూ రాష్ట్రంలోనున్న 18 సహకార చక్కెర కర్మాగారాల్లో ఎనిమిది ప్రైవేట్ పరమయ్యాయి. భీమసింగి కర్మాగారాన్నీ అదేబాట పట్టించేందుకు కత్తి వేలాడదీశారు. 2003-04 సీజన్‌లో క్రషింగ్ చేయకూడదని అప్పటి టీడీపీ ప్రభుత్వమే ఆదేశాలు ఇచ్చిన సంగతి రైతులకు తెలియనిది కాదు. ఫ్యాక్టరీ తాత్కాలికంగా మూతపడింది. నాటి ప్రతిపక్ష నేత వై.ఎస్. రాజశేఖరరెడ్డి పాదయాత్ర 2003 ఏప్రిల్‌లో భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ మీదుగానే సాగింది. ఆ సమయంలో చెరకు రైతులు ఆయన వద్ద తమ గోడు వినిపించుకున్నారు. వారికి అభయమిచ్చిన ఆయన ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఫ్యాక్టరీని తెరిపించారు. ప్రభుత్వ గ్యారెంటీతో రూ.3.50 కోట్ల రుణం అందించారు.


అప్పటికి ఫ్యాక్టరీకి గుదిబండగానున్న అప్పులు రూ.18.04 కోట్లను ప్రభుత్వ షేరు ధనంగా మార్చారు. ఆధునికీకరణకు రూ.36.18 కోట్లు మంజూరు చేశారు. తద్వారా క్రషింగ్ సామర్థ్యాన్ని 1205 మెట్రిక్ టన్నుల నుంచి 2 వేల మెట్రిక్ టన్నులకు పెంచడం, పవర్ ప్లాంట్ ఉత్పత్తి కూడా 1.5 కిలోవాట్ల నుంచి 12 కిలోవాట్లకు పెంచడం లక్ష్యాలుగా నిర్దేశించారు. మిగులు విద్యుత్తును ప్రభుత్వానికి విక్రయించడం ద్వారా ఫ్యాక్టరీ కొంత లాభపడటం అనేదీ ఇందులో భాగం. మరోవైపు ఫ్యాక్టరీ ఆధునికీకరణకు తమ వంతు సహకారంగా రైతులు నుంచి రూ.3 కోట్ల వరకూ పెట్టుబడి నిధి కూడా సేకరించారు. దాన్ని బ్యాంకులో డిపాజిట్ చేస్తే అది వడ్డీతో రూ.5 కోట్లు అయ్యింది.

ఈ దుస్థితికి బాధ్యులు టీడీపీ నాయకులే....



'భీమసింగి చక్కెర కర్మాగారం దుస్థితికి ముమ్మాటికీ టీడీపీ నాయకులే కారణం. ఇప్పుడు చెరకు రైతులను మభ్యపెట్టడానికి మొసలికన్నీరు కార్చుతున్నారు. సహకార రంగంలో నున్న చక్కెర కర్మాగారాలను ప్రైవేట్‌పరం చేయాలనే దురుద్దేశంతో చంద్రబాబు తొలి దఫా పాలన సమయంలో పూర్తిగా నిర్వీర్యం చేశారు. ఫలితంగా 2003 సంవత్సరం నాటికి భీమసింగి మూతపడింది. సీతానగరం వద్దనున్న చక్కెర కర్మాగారాన్ని ప్రైవేట్‌పరం చేసేశారు. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత భీమసింగి ఫ్యాక్టరీకి జీవం పోశారు. లాభాల బాట పట్టించారు. మళ్లీ 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత యథావిధిగా నష్టాల్లో ముంచారు. ఫ్యాక్టరీ అభివృద్ధి కోసం రైతుల వంతుగా సేకరించిన రూ.5 కోట్ల సొమ్మును అప్పటి టీడీపీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు దుర్వినియోగం చేశారు. రూ.12 కోట్లు ఇస్తామన్న చంద్రబాబు హామీ కాగితాలకే పరిమితమైంది. వారు అనుసరించిన విధానాలతో నష్టపోయిన రైతులు చెరకు సాగు నుంచి క్రమేపీ తప్పుకున్నారు. చంద్రబాబు ప్రభుత్వం దిగిపోయే సరికి నాలుగో వంతుకు సాగు విస్తీర్ణం పడిపోయింది. ఇంత తక్కువ క్రషింగ్‌తో ఫ్యాక్టరీని నడపడం ఆర్థికంగా మరింత నష్టమే తప్ప లాభంలేని పరిస్థితి. అయినప్పటికీ పదిమందికీ ఉపాధి కల్పించాలనే సంకల్పంతో 2019 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహకార చక్కెర కర్మాగారాలపై సబ్‌కమిటీ వేసిన సంగతి తెలిసిందే. చెరకు రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతోనే సంకిలి వద్దనున్న ప్యారీస్ సుగర్ ఫ్యాక్టరీకి అనుసంధానం చేశాం. రైతులకు సకాలంలోనే చెల్లింపులు జరుగుతున్నాయి. వాస్తవాన్ని దాచేసి రాజకీయం చేయడం టీడీపీ నాయకులకు తగదు.'

– బొత్స అప్పలనర్సయ్య, గజపతినగరం ఎమ్మెల్యే



అనాలోచిత చర్యలు...

2014 సంవత్సరంలో టీడీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని విస్మరించింది. అప్పటి గజపతినగరం ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు ఫ్యాక్టరీ జనరల్ బాడీ సమావేశాన్ని తూతూమంత్రంగా నడిపించేవారు. టీడీపీ నాయకుడు అశోక్ గజపతిరాజు ఆ సమావేశాలకు హాజరైన దాఖలాలు లేవు. ఇదే అదనుగా ఫ్యాక్టరీ ఆధునికీకరణకు బ్యాంకులో ఉన్న రూ.5 కోట్ల నిధిని కె.ఎ.నాయుడు దుర్వినియోగం చేశారు. రైతులు అడగకపోయినా ఆ డిపాజిట్లను పంచేశారు. దీంతో ఆధునికీకరణ ప్రతిపాదనను ఉద్దేశపూర్వకంగానే తెరవెనుకకు పంపించేశారు. కర్మాగారం కమిటీ చైర్మన్‌గా గంట్యాడ మండలానికి చెందిన గుల్లిపల్లి లలితను నియమించినప్పటికీ నెల తిరగకముందే ఆమె పదవికి స్వయంగా టీడీపీ నాయకులే ఎసరుపెట్టారు. వర్గపోరుతో కోర్టుకెళ్లి ఆమె పదవిని రద్దు చేయించారు.

టీడీపీ పాలనలోనే శాపం...

విజయనగరం, శృంగవరపుకోట, గజపతినగరం, నెల్లిమర్ల, భీమిలి నియోజకవర్గాల పరిధిలో రైతులకు మేలు చేసేలా భీమసింగి చక్కెర కర్మాగారం 1976-77లో తొలిసారి క్రషింగ్‌ను ప్రారంభించింది. దీనిలో 16,873 మంది రైతులు షేర్ హోల్డర్స్‌గా, 3500 మంది నాన్ షేర్ హోల్డర్స్‌గా ఉన్నారు. తొలుత 543 గ్రామాల్లో ఆరు వేల మంది రైతులకు ఉపయోగపడేది. ఆ సమయంలో 8 వేల ఎకరాల్లో చెరకు సాగు చేసేవారు. టీడీపీ పాలనలో జరిగిన తప్పిదాలు, వరుస నష్టాలతో రైతులు చెరకు సాగు తగ్గించేశారు. ప్రస్తుతం సుమారు 2,500 మంది రైతులు కేవలం 3,500 ఎకరాల్లో మాత్రమే చెరకు చేస్తున్నారు. కార్మికుల సంఖ్య కూడా 838 నుంచి 263కు తగ్గిపోయింది.

తీరని నష్టాల్లోకి ఫ్యాక్టరీ...

గత టీడీపీ ప్రభుత్వం అనుసరించిన విధానాల ఫలితంగా భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ తీరని నష్టాల్లో కూరుకుపోయింది. ఇప్పుడు సుమారు రూ.47.88 కోట్లు నష్టాల్లో ఉంది. వీటికి తోడు ఆప్కాబ్ నుంచి రూ.25 కోట్ల రుణం తీసుకొచ్చారు. దీనిపై ఏటా దాదాపు రూ.3.2 కోట్ల వరకూ వడ్డీ చెల్లించాల్సిన పరిస్థితి. మరోవైపు కర్మాగారం యంత్రాలన్నీ మూడు దశాబ్దాలు అయిపోవడంతో పాతవయ్యాయి. పవర్ యూనిట్ చినుకుపడితే చాలు కారిపోతోంది. దీని ఆధునికీకరణకు గత టీడీపీ ప్రభుత్వం రూ.12 కోట్లు మంజూరుచేసినట్లు ప్రకటించినా అది కాగితాలకే పరిమితమైంది.

రైతులకు ఉపయోగపడేలా...

భీమసింగితో పాటు రాష్ట్రంలోని పలు సహకార చక్కెర కర్మాగారాల పునరుద్ధరణపై ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నిపుణుల కమిటీని నియమించారు. అదే సమయంలో భీమసింగి ఫ్యాక్టరీపై ఆధారపడిన రైతులకు నష్టం లేకుండా జిల్లాకు చెందిన మంత్రి బొత్స సత్యనారాయణ, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ప్రభుత్వంతో చర్చించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. గత మూడేళ్లుగా రైతులు సంకిలి వద్దనున్న ఈఐడీ ప్యారీ సుగర్ ఫ్యాక్టరీకి చెరకును తరలిస్తున్నారు. బిల్లులు కూడా పక్షం రోజులకోసారి చెల్లించేలా ఏర్పాట్లు చేశారు.

జల క్రీడలతో ఆరోగ్యం

- పిల్లల్లో క్రీడలపై ఆసక్తి పెంచాలి
- సోషల్ మీడియా ప్రభావాన్ని క్రీడలపై పడనీయొద్దు
- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి



జలాసనం వేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం:

జల క్రీడలు, యోగాతో ఆరోగ్యం సిద్ధిస్తుందని ఏపీ శాసన సభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. పిల్లల్లో క్రీడలపై ఆసక్తి పెంచాలని, సోషల్ మీడియా దుష్ప్రభావం పిల్లలు, క్రీడలపై పడకుండా జాగురూకత వహించాలని కోరారు. ఈ నెల 11న జాతీయ స్విమ్మింగ్ పూల్ డే సందర్భంగా విజయనగరం కంటోన్మెంట్ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో బుధవారం అరగంట పాటు ఆయన వివిధ యోగాసనాలు వేశారు. స్విమ్మింగ్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. జల క్రీడలకు ఉన్న ప్రాధాన్యతను తెలియజేశారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున, తన వ్యక్తిగతంగా కూడా క్రీడలకు తగిన ప్రోత్సాహం అందిస్తున్నట్టు వెల్లడించారు. విజయనగరం కార్పొరేషన్ పరిధిలో ఇప్పటికే పలు స్విమ్మింగ్ పూల్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని గుర్తు చేశారు.

మహిళల కోసం ప్రత్యేకంగా స్పోర్ట్స్ కాంప్లెక్సును, స్విమ్మింగ్ పూల్‌ను నిర్మించామన్నారు. ఈతతో మానసిక, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలని హితవు పలికారు. సోషల్ మీడియా ప్రభావంతో చాలా మంది పిల్లలు క్రీడలకు దూరం అవుతున్నారని, ఇది మంచిది కాదన్నారు. ఈ నెల 11న కంటోన్మెంట్ ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో జల క్రీడల ప్రాధాన్యతను తెలుపుతూ వివిధ యోగా జలాసనాలు వేయనున్నామని.. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నగరవాసులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, ఏపీఐడీసీ డైరెక్టర్ ఎస్.బంగారు నాయుడు, పార్టీ నాయకులు కాళ్ల సూరిబాబు, కనకల కృష్ణ, బోడసింగి ఈశ్వరరావు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి 10న ఇంటర్వ్యూ

విజయనగరం క్రైమ్:

జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏఆర్ పోలీస్ లైన్స్‌లో నడుపుతున్న పోలీస్ వెల్ఫేర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఖాళీగా ఉన్న రెండు ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి ఈ నెల 10న ఇంటర్వ్యూ నిర్వహిస్తామని ఎస్పీ ఎం.దీపిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్, ఫిజిక్స్ పోస్టులకు అర్హత గల అభ్యర్థులు ఆ రోజు ఉదయం 10 గంటలకు స్కూల్‌లో నిర్వహించే టీచింగ్ డెమో, మౌఖిక పరీక్షకు నేరుగా హాజరుకావాలన్నారు. వివరాలకు సెల్: 94917 99315 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

46 మందికి గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి

మధురవాడ: ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలో 46 మంది స్కూల్ అసిస్టెంట్లకు ప్రభుత్వ నిర్వహణలోని పాఠశాలల్లో గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి కల్పించినట్టు ఆర్జేడీ ఎం.జ్యోతికుమారి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆదేశాలు జారీ చేసి.. వెంటనే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. మధురవాడలోని జోన్-1 పాఠశాల విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించే ప్రక్రియ మంగళవారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఉమ్మడి విశాఖలో 25, విజయనగరంలో 7, శ్రీకాకుళంలో 14 కలిసి మొత్తం 46 పోస్టులు ఖాళీ ఉన్నట్లు అధికారులు నిర్ధారించి కౌన్సెలింగ్ చేపట్టారు. మొత్తం 72 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఇందులో ముగ్గురు ప్రమోషన్ వద్దన్నారు. దీంతో వారి తర్వాత స్థానంలో ఉన్న వారికి ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి కల్పించారు. వారందరినీ ప్రస్తుత ప్రదేశాల నుంచి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు రిలీవ్ చేయాలని ఆదేశించారు. ఉద్యోగోన్నతి పొందిన వారంతా తమకు కేటాయించిన పాఠశాలల్లో గ్రేడ్-2 హెచ్‌ఎంగా విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



ఉద్యోగోన్నతి పొందిన వారికి నియామక పత్రం అందజేస్తున్న ఆర్జేడీ జ్యోతికుమారి

గీత దాటిన రామతీర్థం అర్చకులు

- టీడీపీ బస్సు యాత్రలో అత్యుత్సాహం
- పార్టీ కార్యక్రమమని మరిచారా?
- ధర్మ కర్త వచ్చింది దేవస్థానానికా?
- ఆరు కిలోమీటర్ల దూరం వెళ్లి మరీ పూర్ణకుంభంతో స్వాగతం
- సిబ్బంది తీరుపై స్థానికుల ఆగ్రహం



నెల్లిమర్ల పట్టణంలో టీడీపీ బస్సు యాత్రలో పాల్గొన్న అశోక్, టీడీపీ నేతలకు పూర్ణ కుంభంతో ఆహ్వానం పలుకుతున్న రామతీర్థం ఆలయ అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానం రాజకీయాలకు కేంద్ర బిందువుగా మారుతోంది. ప్రశాంతంగా రాములోరి సేవలో ఉండాల్సిన అర్చకులు, సిబ్బంది స్వామి భక్తి చాటుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తరుచూ అత్యుత్సానికి పోతూ అబాసుపాలవుతున్నారంటూ ఆలయంలో పనిచేసిన వారే చెప్పుకోవడం గమనార్హం. వివరాల్లోకి వెళితే.. నెల్లిమర్ల మండల కేంద్రంలో టీడీపీ నేతలు బుధవారం బస్సుయాత్ర నిర్వహించారు. రామతీర్థం దేవస్థానానికి సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న నెల్లిమర్ల పట్టణంలో తొలుత బస్సు యాత్ర ప్రారంభమైంది. కేంద్ర మాజీ మంత్రి, రామతీర్థం ఆలయ ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంతవరకూ బాగానే ఉన్నా... పార్టీ కార్యక్రమానికి విచ్చేసిన అశోక్ గజపతిరాజు, ఇతర టీడీపీ నాయకులను ఆహ్వానించేందుకు రామక్షేత్రంలో పనిచేస్తోన్న అర్చకులు, సిబ్బంది ఏకంగా ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న నెల్లిమర్ల పట్టణానికి వెళ్లారు. సన్నాయి మేళం, వేద మంత్రోచ్చరణ నడుమ పూర్ణ కుంభంతో స్వాగతించి స్వామి భక్తిని చాటుకున్నారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో పని చేస్తున్న అర్చకులు, సిబ్బంది వ్యవహరించిన తీరును వేదపండితులు, భక్తులు తప్పుబడుతున్నారు. వాస్తవానికి ఆలయ ధర్మకర్తగా ఆయనకు గౌరవమివ్వడాన్ని ఎవరూ తప్పుబట్టరు. ఆలయ సంప్రదాయం ప్రకారం దర్శనం నిమిత్తం దేవస్థానానికి వచ్చినప్పుడే పూర్ణకుంభంతో స్వాగతం పలకాల్సి ఉంది. ఇవన్నీ పక్కన పెట్టి పొలిమేర దాటి వెళ్లి మరీ పార్టీ కార్యక్రమానికి వచ్చిన టీడీపీ నేతలకు స్వాగతం పలకడంపై కొందరు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం ఈఓ కిశోర్‌కుమార్ సెలవులో ఉన్నారు. స్థానాచార్యులుగా వ్యవహరిస్తున్న నరసింహాచార్యులను సంప్రదించగా ట్రస్టు బోర్డు చైర్మన్ అశోక్ గజపతి రాజు కబురుతోనే తమ సిబ్బంది వెళ్లారని, పార్టీలకు మాకు సంబంధం లేదని సమాధానం ఇచ్చారు.

శాస్త్రం, నిబంధనలు ఏం చెబుతున్నాయి...

ఆగమ శాస్త్రం, దేవదాయశాఖ నిబంధనల ప్రకారం ఆలయానికి వచ్చే ధర్మకర్తలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, న్యాయకోవిదులు, కలెక్టర్, ఎస్పీ స్థాయి ఉన్నతాధికారులకు ఆలయ ప్రవేశ ద్వారం నుంచి పూర్ణకుంభంతో ఆహ్వానం పలకాలి. ఈ నిబంధనలను రామతీర్థం ఆలయ అర్చకులు, సిబ్బంది పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ధర్మకర్తగా ఉన్న అశోక్‌కు నిబంధనలు తెలియవా? లేదంటే వర్తించవా అన్న వాదన వినిపిస్తోంది.

'తాటిపూడి' నీరు విడుదల

- పాల్గొన్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ రఘురాజు
- జలాశయం వద్ద బుచ్చిఅప్పారావు విగ్రహం ఏర్పాటుకు సహకరిస్తామని వెల్లడి



జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ రఘురాజు

గంట్యాడ: ఖరీఫ్ సాగుకు గొర్రిపాటి బుచ్చి అప్పారావు (తాటిపూడి) జలాశయం నీటిని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారుకు వరుణుడి ఆశీస్సులు ఉన్నాయని, నాలుగేళ్లుగా సాగునీటికి ఇబ్బందులు తలెత్తలేదని, రైతులకు పంటలు కలిసివచ్చాయని పేర్కొన్నారు. ఈ ఏడాది కూడా సాగునీటి సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. జలాశయం వద్ద గొర్రిపాటి బుచ్చి అప్పారావు నేమ్ బోర్డును ఏర్పాటు చేస్తామని, ఆయన విగ్రహ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని అందిస్తామని చెప్పారు. జలాశయం పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలోనే మన ప్రాంతానికి పోలవరం నీరు వస్తుందన్నారు. పోలవరం నుంచి చెరువులకు ముందుగా నీరు ఇచ్చే ఆలోచనతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పనులు జరిపిస్తున్నారన్నారు. గోదావరి జిల్లాల మాదిరిగా ఈ ప్రాంతంలో రెండు పంటలు పండించే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

ఇరిగేషన్ అధికారులపై రైతుల ఫిర్యాదు

సాగునీటి కాలువలు మూసివేసి పెద్దపెద్ద బ్రిడ్జిలు నిర్మిస్తున్నారని, హైవే అధికారులను అడిగితే కలెక్టర్ అనుమతి ఇచ్చారని చెబుతున్నారని, ఇరిగేషన్ అధికారులు అనుమతి లేకుండా సాగునీటి కాలువలపై నిర్మాణాలు ఎలా చేపడతారని పలువురు రైతులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ కలెక్టర్ లిఖిత పూర్వకమైన ఆదేశాలు ఇచ్చారా అని ఇరిగేషన్ అధికారులు సాయి, తమ్మినాయుడు, పాండులను అడిగారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యతను విస్మరించడం తగదన్నారు. సాగునీటి కాలువలకు ఇబ్బంది లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశాలు ఇస్తే, ఎటువంటి ఆదేశాలు ఇవ్వలేదని ఎలా చెబుతారంటూ మండిపడ్డారు. వెంటనే ఫోన్‌లో జేసీ మయూర్‌అశోక్‌కు ఫోన్‌చేసి సాగునీటి కాలువమూసి వేయడం వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులను తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, జామి వైఎస్సార్ సీపీ నాయకులు రవికుమార్, సత్యారావు, మండల నాయకులు నారాయణమూర్తిరాజు, లచ్చిరెడ్డి కృష్ణ, పి.నారాయణమూర్తి, తహసీల్దార్ స్వర్ణకుమార్, ఇరిగేషన్ డీఈ పాండు, ఏఈ తమ్మినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హెచ్ఐవీ పరీక్షల సంఖ్యను పెంచాలి

● మన్యం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి శ్యామ్‌కుమార్

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీ పరీక్షల సంఖ్యను పెంచాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ శ్యామ్‌కుమార్ తెలిపారు. స్థానిక యూత్ హాస్టల్‌లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సిబ్బందితో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు హెచ్ఐవీ పరీక్షలతో పాటు, సిఫిలీస్ పరీక్షలు చేయాలన్నారు. దానికి ప్రభుత్వం పంపిన డ్యూయల్ కిట్లను వినియోగించుకోవాలని సూచించారు. హెచ్ఐవీ నివారణలో స్వచ్ఛంద సంస్థల సహకారం ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలో పి.బాలాజీ, సాక్షి గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని బుచ్చన్నపేట గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. తమకి వచ్చిన ముందస్తు సమాచారం మేరకు మంగళవారం రాత్రి తనిఖీలు చేపట్టగా బుచ్చన్నపేట గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.6,450 నగదు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యలు నిమిత్తం కోర్టుకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



పేరాపురంలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖ ఎ.డి విజయ, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయశాఖ ఎ.డి ఎల్.విజయ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బంది, వ్యవసాయ అధికారులు దుకాణాలు తనిఖీ చేసి రికార్డులు, స్టాకు పరిశీలించారు. మండల కేంద్రంతో పాటు పేరాపురంలో తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో ఏఓ కె.నీలిమ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

సొండి కులస్తులను ఓబీసీలో చేర్చాలి



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న సొండి కుల సంఘ పెద్దలు

బొబ్బిలి: సొండి కులస్తులను ఓబీసీలో చేర్చేందుకు కృషి చేయాలని ఆ కుల సంఘ పెద్దలు రత్నాల కాశీవిశ్వనాథ చౌదరి, బి.రాజారావు కోరుతున్నారు. ఇదే విషయమై వారు అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో అత్యంత వెనకబడి ఉన్న సొండి కులస్తులను ఓబీసీ జాబితాలో చేర్చి, వారి అభ్యున్నతికి కృషి చేయాలని, దీనిపై ఢిల్లీలోని ఎన్‌సీబీసీకి నివేదిక సమర్పించాలని కోరారు.

ప్రేమ.. పెంపకం

మూగ జీవాల పట్ల ప్రస్తుత సమాజంలో చెప్పుకోదగ్గ ప్రేమనే మానవ సమాజం చూపిస్తోంది. ఒకప్పటితో పోల్చితే కొన్ని జీవాల పెంపకం స్టేటస్‌గా కూడా మారింది. అయితే వీటి పెంపకంపై చూపుతున్న శ్రద్ధతో పాటు వీటి నుంచి సంక్రమించే వ్యాధుల పట్ల సరైన అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. నేడు ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా ప్రత్యేక కథనం

● జంతువుల పెంపకంపై పెరుగుతున్న ఆసక్తి
● అవగాహన తప్పనిసరి అంటున్న వైద్యులు
● నేడు ప్రపంచ జునోసిస్ డే



రాజాంలోని ఓ ఇంట్లో కుందేలు పిల్లలు

రాజాం సిటీ: మానవ జీవన విధానంలో జంతువులు సైతం భాగమయ్యాయి. మనిషి తన అవసరాల కోసం కుక్కలు, పిల్లులు, ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కుందేళ్లు ఇలా రకరకాల జంతువులను పెంచుకుంటున్నారు. నిన్న మొన్నటి వరకు సరదాకు, ఇంటి కాపలాకు పరిమితమైన కుక్కల పెంపకం ప్రస్తుతం స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. అయితే ఎంతో ఇష్టంగా పెంచుకుంటున్న జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు.

పెరుగుతున్న జంతు ప్రేమ

సమాజంలో జంతు ప్రేమ రోజు రోజుకు పెరిగిపోతుంది. ప్రేమనైతే పంచుతున్నారుగాని వాటితో కలిగే వ్యాధుల గురించి పట్టించుకోవడంలేదు. వైద్య నిపుణుల పరిశోధన ప్రకారం జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు 190 రకాల వ్యాధులు సోకే అవకాశం ఉంది. ఇలా సోకే వ్యాధులను జునోసిస్ అంటారు. కుక్క కాటు ద్వారా రేబిస్, పందుల ద్వారా మెదడువాపు, పశువులు, గొర్రెల నుంచి టీబీ వ్యాధులు సంక్రమిస్తాయని, వీటన్నింటిలో రేబిస్ వ్యాధి ప్రమాదకరమైనదిగా వైద్యులు పేర్కొంటున్నారు.

జునోసిస్ ఎలా వచ్చిందంటే...

పశువుల నుంచి మనుషులకు వచ్చే వ్యాధుల్లో రేబిస్ అత్యంత ప్రమాదకరమైన, ప్రాణాంతకమైన వ్యాధి. లూయిస్ పాశ్చర్ అనే శాస్త్రవేత్త పిచ్చికుక్క కాటుకు గురైన వ్యక్తికి 1885 జూలై 6న మొట్టమొదటిసారిగా యాంటీ రేబిస్ టీకాను ఇచ్చారు. ఇది విజయవంతమై అత్యంత ప్రాచుర్యం పొందింది. రేబిస్ టీకాను జూలై 6న కనిపెట్టడం వల్ల ఆ రోజున ప్రపంచ జునోటిక్ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.



ఇటువంటి పిల్లలకు టీకాలు తప్పనిసరి

పిల్లల విషయంలో జాగ్రత్త

పిల్లల విషయంలో తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. కుక్కలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో చిన్నారులు బయట తిరగకుండా చూసుకోవాలి. తమ పెంపుడు కుక్కలు బయట తిరిగే సమయంలో ఇతరులపై దాడి చేయకుండా యజమానులు జాగ్రత్త పడాలి.

వ్యాక్సినేషన్ వేయించాలి

పెంపుడు జంతువులకు వేసే వ్యాక్సినేషన్‌పై చాలా మందికి అవగాహన ఉండదు. కొందరు ఖర్చుతో కూడినదని పట్టించుకోరు. పెట్స్‌కు మామూలుగా కరిచే గుణం ఉంటుంది. కాబట్టి వ్యాక్సినేషన్ తప్పనిసరిగా చేయించాలి. మనిషి, జంతువుకు ఉండే కాంటాక్ట్‌లో అది కరవడం, గీరడం వంటివి సాధారణంగా జరుగుతుంటాయి. దాని వల్ల ఏదైనా ఆరోగ్య సమస్య రావచ్చు. కుక్కలు, పిల్లులు పెంచుతున్న వారు కూడా వ్యాక్సినేషన్ అవసరాన్ని గుర్తించాలి.

వైద్యులు సలహాలు తప్పనిసరి



జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే రోగాలను జునాటిక్ డిసీజస్ అంటారు. ఎబోలా, బర్డ్ ఫ్లూ, రేబిస్, మెదడువాపు వంటివి జునోటిక్ వ్యాధులే. ఈ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే రెగ్యులర్‌గా వెటర్నరీ వైద్యుల సలహాలు తీసుకోవాలి. ముఖ్యంగా ఇంట్లో కుక్కలు పెంపకం చేపట్టిన వారు చర్మ సమస్యలు వస్తే వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలి. సరైన వ్యాక్సిన్ వేయకుండా పెంపుడు జంతువులు, కుక్కలతో సన్నిహితంగా ఉండొద్దు. – **డాక్టర్ ఆర్.నీలయ్య, డీడీ, పశుసంవర్ధక శాఖ, బొబ్బిలి**

పశువుల అక్రమ రవాణాపై చర్యలు తప్పవు : ఎస్పీ



ఎస్పీ దీపిక

విజయనగరం క్రైమ్: పశువుల అక్రమ రవాణా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని ఎస్పీ ఎం.దీపిక బుధవారం హెచ్చరించారు. పశువుల అక్రమ రవాణాను జిల్లాలో నియంత్రించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమ రవాణాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. విజయనగరం ట్రాఫిక్ డీఎస్పీ డి.విశ్వనాథ్‌ను దీనిపై ప్రత్యేక నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. పశువుల అక్రమ రవాణాపై ఎటువంటి సమాచారమైనా తెలిస్తే వెంటనే నోడల్ అధికారికి సమాచారమివ్వాలన్నారు. జిల్లాలో అక్రమ రవాణాకు పాల్పడే వాహనాలను గుర్తించి, వాటిపై కఠిన చర్యలు తీసుకుని చట్టపరంగా వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో సంబంధిత పోలీసు అధికారులు కూడా ఆకస్మికంగా తనిఖీలు చేపట్టాలన్నారు. పశువుల అక్రమ రవాణాదారులపై జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 17 కేసులు నమోదు చేసి 24 మందిని అరెస్టు చేసి 239 పశువులను, 19 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

నేడు ఉచితంగా ర్యాబిస్ టీకాలు

విజయనగరం ఫోర్ట్: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా విజయనగరంలోని వెటరినరీ పోలీక్లినిక్ ఆవరణలో 3 నెలల వయసు దాటిన పెంపుడు కుక్కలు, పిల్లులకు ఉచితంగా ర్యాబిస్ వ్యాధి నిరోధక టీకాలు గురువారం వేస్తామని పశు సంవర్ధక శాఖ ఏడీ ధర్మారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జంతు ప్రేమికులు, సంరక్షకులకు అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు.

బీఆర్‌వో రిక్రూట్‌మెంట్‌లో యువకుడి మృతి



మురళీకృష్ణ మృతదేహం

రామభద్రపురం: మహారాష్ట్రలోని పూణేలో జరుగుతున్న బీఆర్‌వో రిక్రూట్‌మెంట్‌లో రామభద్రపురం గ్రామానికి చెందిన యువకుడు బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలోని చొక్కాపు వీధికి చెందిన చొక్కాపు మురళీకృష్ణ(29)కు బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్‌లో స్టోర్ కీపర్ టెక్నికల్ పోస్టు కోసం కాల్ లెటర్ వచ్చింది. దీంతో అతడు రెండు రోజుల క్రితం మహారాష్ట్రలోని పూణేకు వెళ్లాడు. అక్కడ కొన్ని ఈవెంట్‌లైన తర్వాత బుధవారం 1600 మీటర్ల పరుగు పందెం ఈవెంట్‌లో పాల్గొని పరిగెడుతుండగా మధ్యలో సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే అక్కడి అధికారులు వైద్యాధికారికి సమాచారం ఇవ్వగా వైద్యాధికారి వచ్చి పరీక్షించారు. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతి చెందాడన్న వార్త తెలియడంతో గ్రామమంతా విషాదఛాయలు అలుముకున్నాయి. పోస్టుమార్టం నిమిత్తం అక్కడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఉద్యోగం సాధించి వస్తానని చెప్పి వెళ్లిన కుమారుడు మృతి చెంది, తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడని తెలుసుకున్న తల్లి జయమ్మ గుండెలవిసేలా రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. గత కొన్నేళ్ల క్రితం తండ్రి మృతి చెంది, ఇప్పుడు అందివచ్చిన కొడుకు చనిపోవడంతో పెద్దదిక్కు కోల్పోయామని తల్లి, ఇద్దరు అక్కలు బోరున విలపిస్తున్నారు.

డిజిటల్ బోధనతో అభ్యసనంపై ఆసక్తి



డిజిటల్ బోధనలో కొత్త మెలకువలు నేర్చుకుంటున్న ఉపాధ్యాయులు

రాజాం: ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యాబోధన ద్వారా విద్యార్థుల్లో అభ్యసనంపై ఆసక్తి పెంచవచ్చని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ కోర్సు డైరెక్టర్ ఆర్.మురళీకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక జీఎంఆర్ ఐటీలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు అందిస్తున్న డిజిటల్ బోధనకు సంబంధించిన శిక్షణలో పాల్గొన్న ఆయన డిజిటల్ విధానంలో బొమ్మలు వేయడం, బైజ్యూస్ యాప్‌లోని కంటెంట్‌ను బోధించడం, విద్యార్థుల దృష్టిని ఆకర్షించేలా ప్రపంచంలోని అంశాలను డిజిటల్ విధానం ద్వారా ప్లే చేయడం వంటి అంశాలను వివరించారు. ఫెసిలిటేటర్స్ కుమారాపు చంద్రునాయుడు, ప్రసాద్ పలు కొత్త విషయాలను ఉపాధ్యాయులకు వివరించారు. కార్యక్రమంలో ట్రైనర్స్ సతీష్, రవికిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఐహెచ్ఐపీ పోర్టల్‌లో డెంగీ, మలేరియా వివరాలు

● డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: డెంగీ, మలేరియా వంటి వ్యాధుల వివరాలు ఐహెచ్ఐపీ పోర్టల్‌లో నమోదు చేయాలని డీఎంహెచ్ఓ ఎస్. భాస్కరరావు తెలిపారు. స్థానిక రహమాన్ ఆస్పత్రిని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. లేబరేటరీలో ఎల్-ఫామ్, పీ- ఫామ్‌లను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వైద్య పరీక్షలు, ఫీజుల వివరాలు తెలిపే బోర్డులు ఆస్పత్రిలో ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎపిడిమాలజిస్ట్ డాక్టర్ జి. వెంకటేష్, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యరాజ్, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేను పరిశీలించిన తిరుపతి జేసీ

● అద్భుతంగా ఉందని ప్రశంసలు



రామలింగాపురంలో సర్వే పనులను పరిశీలిస్తున్న తిరుపతి జేసీ బాలాజీ తదితరులు

కొత్తవలస : వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ పరిరక్ష పథకంలో చేపట్టిన రీ సర్వే రాష్ట్రంలోనే విజయగనరం జిల్లా ప్రథమ స్థానంలో ఉందని తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీ పేర్కొన్నారు. మండలంలోని రామలింగాపురం గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వే కార్యక్రమాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న రీ సర్వే కార్యక్రమం తిరుపతి జిల్లాలో నేటికీ పూర్తి స్థాయిలో ప్రారంభం కాలేదన్నారు. రాష్ట్రంలోనే విజయనగరం జిల్లాలో రీసర్వే శరవేగంగా సాగుతుందని, ఏ విధంగా నిర్వహిస్తున్నారు.. తదితర అంశాలు పరిశీలించేందుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. అనంతరం విజయనగరం జిల్లా సర్వే ఏడీ టి.త్రివిక్రమరావు మాట్లాడుతూ జిల్లాలో మొదటి ఫేజ్‌లో 179 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసామని ప్రస్తుతం సర్వే పూర్తి చేసి 2,48,448 జగనన్న హద్దురాళ్లను కూడా వేశామన్నారు. అలాగే రెండో ఫేజ్‌లో 319 గ్రామాలను ఎంపిక చేశామన్నారు. ప్రస్తుతం 80 గ్రామాల్లో సర్వే పూర్తయినట్టు తెలిపారు. మిగిలిన గ్రామాలు ఆగస్టు నెలాఖరి నాటికి పూర్తి చేస్తామన్నారు. సర్వే సిబ్బంది అంకిత భావంతో పని చేయడం వలన రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా సర్వే ఏడీ జయరాజు, కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, తహసీల్దార్ శ్రీనివాసమిశ్ర, డిప్యూటీ తహసీల్దార్ కోట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కన్నీటి 'సాగరం'..!

● ముగ్గురు భవన నిర్మాణ కార్మికుల మృతితో విషాదంలో కుటుంబ సభ్యులు
● మృతదేహాలకు అంతిమ సంస్కారాలకు ఏర్పాట్లు



మేనత్త గంగమ్మ వద్ద పెరుగుతున్న జగన్నాథం కుమారుడు లక్ష్మణ, కుమార్తె రాము



తండ్రిని కోల్పోయి నాన్నమ్మ సుభద్రమ్మ చెంత చేరిన మనుమలు గణేష్, మణికంఠ

కన్నీటి రోదన



చిత్రంలో విలపిస్తున్న వృద్ధుడిపేరు రాపాక నగిరేసు. ప్రహరీ కూలిన ప్రమాదంలో తమ్ముడు రాపాక కన్నయ, అల్లుడు నక్కేల సత్యం మృతితో కన్నీటిపర్యంతమవుతున్నాడు. ప్రమాదంలో తమ్ముడు, అల్లుడు మృతిచెందడంతో విషాదంలో మునిగిపోయాడు.

బాడంగి: చెన్నైలోని కోయంబత్తూరు సమీపంలోని కృష్ణాకళాశాల ప్రహరీ పునర్నిర్మాణ పనుల్లో నిమగ్నమైన కూలీలపై మంగళవారం సాయంత్రం ప్రహరీ కూలిపోవడంతో నలుగురు మృతిచెందిన విషయం పాఠకులకు తెలిసిందే. వీరిలో ముగ్గురు బాడంగి మండలం వీరసాగరానికి చెందిన వారుకాగా, ఒకరు ఉత్తరాదికి చెందిన వారు. మృతుల కుటుంబాలు సుమారు 15 ఏళ్లుగా వలస జీవనంపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. చెన్నైలో భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తూ పండగలకు, శుభకార్యాలకు స్వగ్రామానికి వచ్చి వెళ్తున్నారు. నెలరోజుల కిందటే గ్రామానికి వచ్చి మళ్లీ చెన్నైవెళ్లినట్టు గ్రామస్తులు చెబుతున్నారు. కొల్లి జగన్నాథం, నక్కేల సత్యం, రాపాక కన్నయ్య మృతితో వారి కుటుంబాలు కన్నీటిపర్యంతమవుతున్నాయి. ముగ్గురు మృతదేహాలు గురువారం నాటికి విమానంలో విశాఖపట్నం విమానాశ్రయానికి, అక్కడి నుంచి గ్రామానికి చేరుతాయని గ్రామస్తులు చెబుతున్నారు. అంతిమ సంస్కారాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

● మృతుడు కొల్లిజగన్నాథం కుమారుడు లక్షణ రాజమండ్రిలో ఎమ్మెస్సీ చదువుతుండగా, వివాహమైన రాముఅనే కుమార్తె ఉన్నారు.

● నక్కేల సత్యానికి తల్లి సుభద్రమ్మతో పాటు ఇంటర్మీడియట్, 9వ తరగతి చదువుతున్న గణేష్,మణికంఠ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు.

● మృతుడు రాపాక కన్నయ్యకు సూర్యారావు, వెంకన్న, సత్యవతి అనే ముగ్గురు పిల్లలున్నారు. వీరు తమ తండ్రులు మృత్యు వాతపడ్డారని తెలుసుకొని విలపిస్తున్నారు.

ఉనికి కోసమే టీడీపీ బస్సు యాత్ర

● అవినీతి ఆరోపణలపై అశోక్ ప్రమాణం చేయగలరా?
● టిడ్కో గృహాల్లో అవినీతి ఎక్కడో నిరూపించండి
● ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



సోనియానగర్‌లో టిడ్కో ఇంటి వద్ద విలేకరులతో మాట్లాడుతున్న కోలగట్లవీరభద్రస్వామి

విజయనగరం: టీడీపీ నాయకులు తమ ఉనికిని చాటుకునేందుకే బస్సు యాత్ర చేస్తున్నారని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి విమర్శించారు. బస్సు యాత్రలో వాస్తవాలు చెబితే ప్రజలు హర్షిస్తారని.. అవాస్తవాలు చెబితే నమ్మే స్థితిలో ఎవరూ లేరన్న విషయాన్ని తెలుసుకోవాలని హితవు పలికారు. విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని సొంతిళ్లు లేని వారి కోసం సోనియానగర్‌లో నిర్మిస్తున్న టిడ్కో గృహ సముదాయాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. టిడ్కో గృహాల్లో అక్రమాలు జరిగినట్లు టీడీపీ నాయకులు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తెలిసీతెలియక మాట్లాడవద్దని హితవు పలికారు. సోనియా నగర్‌లో బలహీన వర్గాలకు ఇళ్లు కడుతున్నామని చెప్పారు. ఎక్కడో విజయవాడలో ఎమ్మెల్సీ ఉద్యోగం చేసుకునే బుద్ధా వెంకన్నకు ఇక్కడ సంగతులు ఏం తెలుస్తాయని ప్రశ్నించారు. 'వెంకన్నా.. చిత్తశుద్ధి ఉంటే మళ్లీ విజయనగరం రా.. నువ్వు చేసిన ఆరోపణలు నిరూపించు.. లేదంటే కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజును విజయనగరం ప్రజల ఆరాధ్యదైవం పైడితల్లి అమ్మవారి ఆలయానికి వచ్చి.. ఫలానా చోట అవినీతి జరిగిందని.. కోలగట్ల లంచాలు తిన్నాడని ప్రమాణం చేయమను..' అంటూ సవాల్ విసిరారు. గతంలో మంజూరు చేసిన లబ్ధిదారుల జాబితాతో రావాలని.. సారిపల్లి, సోనియానగర్‌ల్లో ఒక్క ఇంటినైనా తాము మార్చామని ఎవరితోనైనా చెప్పించగలరా? అని ప్రశ్నించారు. జూట్ మిల్లులు మూసేసి, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటున్నట్లు అశోక్ ఆరోపిస్తున్నారని.. అసలు ఆ మిల్లులు ఎవరి హయాంలో మూతపడ్డాయని ప్రశ్నించారు. టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపుతో అశోక్ అక్కడికి వెళ్లి అర్థం లేని ఆరోపణలు చేయటం తగదని విమర్శించారు. సారిపల్లి, సోనియానగర్ ఇళ్లలో అవినీతి జరిగిదంటున్న టీడీపీ నేతలు సారిపల్లిలో ఇప్పటికే 800 ఇళ్లు లబ్ధిదారులకు అందజేసిన విషయాన్ని తెలుసుకోవాలన్నారు. మరో 400 ఇళ్లు త్వరలో అందించడానికి సిద్ధం చేసినట్లు చెప్పారు. సోనియానగర్‌లో 1100 ఇళ్లకుగానూ 300 ఇళ్లు అన్ని సౌకర్యాలూ కల్పించి త్వరలో లబ్ధిదారులకు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. తాను గంజాయి వ్యాపారానికి సహకరిస్తున్నట్లు ఆరోపణలు చేస్తున్నారని, ఇటువంటి వ్యాఖ్యలు చేయడానికి అశోక్ సిగ్గుపడాలని అన్నారు. తానేంటో, తన వ్యాపారాలు ఏమిటో ఇక్కడ ప్రజలందరికీ తెలుసునని చెప్పారు. సమావేశంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, ఫ్లోర్ లీడర్ ఎస్వీవీ రాజేష్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, కార్పొరేటర్లు అల్లు చాణక్య, బండారు ఆనందరావు, పట్టా ఆదిలక్ష్మి, జోనల్ ఇన్‌చార్జ్‌లు, టిడ్కో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఉచితంగా రిజిస్ట్రేషన్ సేవలు



రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ అందజేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్ మోహన్‌రావు

సంతకవిటి: గ్రామ సచివాలయాల్లో ఉచితంగా అందజేస్తున్న రిజిస్ట్రేషన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహన్‌రావు ప్రజలను కోరారు. మండలంలోని తమరాం గ్రామంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో పాల్గొన్న ఆయన పోతురాజు కాంతమ్మకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్‌ను అందజేశారు. భూమి కొనుగోలు చేసిన రైతులు రిజిస్ట్రేషన్ కోసం మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పనిలేదని, గ్రామంలోనే సచివాలయంలోనే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.వి.రవికుమార్, డీటీ రంజిత్, సర్పంచ్ ఎ.గౌరినాయుడు, పంచాయతీ కార్యదర్శి ఎమ్.ఎల్.నాయుడు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కే. 10గ్రా.)	59,060-00
బంగారం(22కే. 10గ్రా.)	54,150-00
వెండి (కిలో)	75,800-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹ 240